క్లుప్తంగా

ఎంపీని కలిసిన బీజేపీ నేతలు



రఘునందన్‌రావుతో నాయకులు

ములుగు(గజ్వేల్): మెదక్ ఎంపీ రఘునందన్ రావును సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు చింతల అరుణ్‌కుమార్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారించాలని ఎంపీని కోరినట్లు తెలిపారు. ములుగు మండల కో–కన్వీనర్ సత్యంయాదవ్, క్రాంతి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

నంగునూరు(సిద్దిపేట): శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ముండ్రాయిలోని లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. రంగదాంపల్లికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనంతుగా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రాజయ్య, సతీశ్, రవి, రమేశ్, వెంకటేశం, ఆలయ కమిటీ సభ్యులు రాజయ్య, సతీశ్‌యాదవ్, చరణ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న ఎస్సీ నాయకులు

సిద్దిపేటకమాన్: మాల మేధావులందరూ మనువాదులే అన్న మంద కృష్ణ వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ దళిత ఐక్య ఉద్యమాలకు మాలలందరూ ఏకమై పోరాటం చేస్తుంటే తట్టుకోలేక మంద కృష్ణ మాట్లాడిన మాటలు సరికాదన్నారు. రిజర్వేషన్‌ల విషయంలో పోరాటం చేసుకోండి, కానీ మాలల ఆత్మగౌరవాన్ని తగ్గించే విధంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో నర్సింహులు, యాదగిరి, అరుణ్, శంకర్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ మృతి



సత్యనారాయణ(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: మాజీ ఎంపీపీ తాడ సత్యనారాయణ అనారోగ్యంతో సోమవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఆయన హుస్నాబాద్ ఎంపీపీగా, వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా ప్రజలకు, రైతులకు సేవలందించారు. ఆయన మృతిపై మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ ఎంపీపీలు ఆకుల వెంకట్, గంగం సుజాత, తకావత్ మానస, మాజీ సర్పంచ్‌లు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, అక్కు శ్రీనివాస్ పలువురు సంతాపం ప్రకటించారు.

భద్రకాళి, వీరభద్రేశ్వరులకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి, వీరభద్రేశ్వరులు

రాయికోడ్(అందోల్): స్థానిక భద్రకాళి సమేత వీరభద్రేశ్వరులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ సోమవారం సందర్భంగా అర్చకులు అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు ప్రభుత్వ అధికారులు, నాయకులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. ఈఓ శివరుద్రప్ప, సిబ్బంది కృష్ణ, అర్చకులు వీరయ్య, బస్వరాజ్, శివకుమార్, రుద్రయ్య స్వాములు పాల్గొన్నారు.

కృష్ణా.. ముకుందా.. మురారి



జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భక్తులతో సందడిగా మారిన సుందర సత్సంగం



సిద్దిపేటజోన్: ఉట్టి కొడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్

- ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- ఆలయాలలో ప్రత్యేక పూజలు
- వివిధ వేషధారణల్లో అలరించిన చిన్నారులు

శ్రీకృష్ణాష్టమి వేడుకలు జిల్లాలో ఘనంగా కొనసాగాయి. సిద్దిపేట కేంద్రంలోని సుందర సత్సంగంతో పాటుగా అన్ని ఆలయాలలో ఉదయం నుంచే కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి ఆలయాలలో విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, యశోద, గోపికల వేషధారణలో అందరినీ అలరించారు. ఆలయాల వద్ద చిన్నారులు నృత్యాలు, కోలాటాలు చేశారు. ఆలయాల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలు అందించారు.





సిద్దిపేటరూరల్: లింగారెడ్డిపల్లిలో కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు, వింజపల్లిలో..



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భక్తుల క్షీరాభిషేకం



హుస్నాబాద్‌రూరల్: గీతా మందిర్‌లో..



గజ్వేల్‌రూరల్: పల్లకీసేవలో భక్తులు



నంగునూరు(సిద్దిపేట): కోలాటంలో మహిళలు..



చేర్యాల(సిద్దిపేట): కృష్ణుడి వేషధారణలో..



దుబ్బాకటౌన్: ఉట్టి కొడుతున్న చిన్నారులు



తొగుట(దుబ్బాక): కృష్ణుడు, గోపికల వేషధారణల్లో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించండి

- సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు

గజ్వేల్‌రూరల్: అర్హులైన పేదలను గుర్తించి వారికి డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు బట్టు దయానందరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదల కోసం ఇళ్లు నిర్మించినా అవి అసంపూర్తిగానే మిగిలిపోయాయన్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురు చూస్తున్న పేదల ఆశలు అడియాసలుగా మారాయని వాపోయారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం ఇళ్లులేని వారికి రూ.5లక్షలు ఇస్తామని ప్రకటించిన క్రమంలో డబుల్ బెడ్రూం ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శివలింగు కృష్ణ తదితరులు ఉన్నారు.

అ'పూర్వ'సమ్మేళనం

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల హైస్కూల్‌లో 2008–2009 పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 15ఏళ్ల తరువాత వారంతా పాఠశాలలో కలుసుకొని చిన్ననాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం ఆ నాడు తమకు బోధించిన ఉపాధ్యాయులను శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వేణు రెడ్డి, భాను, ప్రసాద్‌రెడ్డి, ఎల్లం, నరేశ్, నర్సింహ, శ్యామల, శోభ, భవాని, కళ, మంగ, చామంతి తదితరులు పాల్గొన్నారు.



సిర్సనగండ్ల హైస్కూల్లో కలుసుకున్న పూర్వవిద్యార్థులు

వ్యక్తి మృతికి కారణమైన వాహనం గుర్తింపు

- నిందితుడి అరెస్ట్

వర్గల్(గజ్వేల్): రోడ్డు పక్కన బైక్ పార్కింగ్ చేస్తున్న వ్యక్తిని ఢీకొట్టి ఆపకుండా పోయిన వాహనాన్ని సోమవారం గౌరారం పోలీసులు పట్టుకొని నిందితుడిని అరెస్ట్ చేశారు. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్ రెడ్డి కథనం మేరకు.. ములుగుకు చెందిన ఎర్రన్న కనకయ్య(38) 18వ తేదీన రాత్రి గౌరారం హోటల్ వద్ద రోడ్డు పక్కన బైక్‌ను పార్క్ చేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో గాయపడిన కనకయ్య చికిత్స పొందుతూ 20న మృతి చెందాడు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి సిద్దిపేట, ప్రజ్ఞాపూర్, గజ్వేల్, గౌరారం, అలియాబాద్ చౌరస్తా, ఓఆర్ఆర్ టోల్ గేట్ వద్ద సీసీ కెమెరాలు చెక్ చేశారు. ప్రమాదానికి కారణమైన టాటా మోటార్స్ గూడ్స్ వాహనాన్ని గుర్తించారు. వాహన డ్రైవర్ బీహార్‌కు చెందిన రాజన్‌కుమార్‌ను అరెస్ట్ చేశామని ఎస్‌ఐ తెలిపారు. వాహనాన్ని, డ్రైవర్‌ను పట్టుకున్న ఎస్‌ఐ, పోలీసులను సీఐ మహేందర్‌రెడ్డి అభినందించారు.



వాహనం, నిందితుడితో పోలీసులు

బీదర్‌లో ఎంపీలకు సన్మానం

నారాయణఖేడ్: కర్ణాటకలోని జిల్లా కేంద్రం బీదర్ పట్టణంలో సోమవారం అక్కడి నాగరిక అభినందన సమితి ఆధ్వర్యంలో సన్మానసభను ఏర్పాటు చేశారు. సభలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, బీదర్ ఎంపీ సాగర్ ఖండ్రేలను ఎంపీలుగా గెలిచిన సందర్భంగా బీదర్ జిల్లా భాల్కీలోని హీరేమఠం పీఠాధిపతి గురుబసవపట్టేదేవరు, కర్ణాటక రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే, పురపాలకశాఖ మంత్రి రహీంఖాన్ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎంపీ మాట్లాడారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

దుబ్బాకటౌన్: దుబ్బాక సీఐ ఆధ్వర్యంలో సోమవారం దుబ్బాకలో మిరుదొడ్డి, భూంపల్లి పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సదర్భంగా ఎస్‌ఐ గంగరాజు మాట్లాడుతూ నంబర్ ప్లేట్లులేని వాహనాలకు జరిమానా విధిస్తామన్నారు. దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనాలపై నిఘా అమలుచేస్తున్నామని చెప్పారు. వాహనదారులు సరైన ప్రతాలను కలిగి ఉండాలని సూచించారు.

హెల్మెట్ తప్పని సరి

సిద్దిపేటకమాన్: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని వన్‌టౌన్ ఎస్‌ఐ కనకయ్యగౌడ్ చెప్పారు. పట్టణంలో సాంస్కృతిక సారథి సభ్యులు, పోలీసులు ఆదివారం రాత్రి కనువిప్పు కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. యువత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరం జరిగితే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

దుబ్బరాజేశ్వరస్వామికి ఘనంగా పూజలు



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలం చౌదర్‌పల్లిలో శ్రీదుబ్బరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి దర్శనం చేసుకున్నారు. ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు భరోసా



మద్దూరు(హుస్నాబాద్): చెక్కును అందజేస్తున్న కిరణ్‌కుమార్

మద్దూరు(హుస్నాబాద్): సీఎం రిలీఫ్ ఫండ్ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ అన్నారు. దూళ్మిట్ట మండలంలోని భైరాన్‌పల్లి, బెక్కల్ గ్రామాలకు చెందిన లక్ష్మి, రామిని కిషన్, తీగుళ్ళ లక్ష్మి, రావుల కమాలకర్, కల్లెం రాములుకు మంజూరైన రిలీఫ్ సీఎం ఫండ్ చెక్కులను సోమవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రామవరంలో..

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని రామవరానికి చెందిన నాగరాజ్‌కు రూ.60వేలు, తాడూరి రాజేందర్‌కు రూ.52,500, ఎడబోయిన శ్రీనివాస్‌కు రూ.6వేలు విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం మాజీ సర్పంచ్, సింగిల్ విండో డైరెక్టర్ బుర్ర ప్రభాకర్, గ్రామశాఖ అధ్యక్షుడు రిక్కల కృష్ణారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు త్రిమూర్తి, శ్రీధర్‌రెడ్డి, కనకయ్య, కనకయ్య, ఐలయ్య, భాస్కర్, నవీన్, రాకేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మానవ తప్పిదాలవల్లే ప్రమాదాలు

- సీఐ శ్రీను



సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ శ్రీను

చేర్యాల(సిద్దిపేట): కేవలం మానవ తప్పిదం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక సీఐ ఎల్. శ్రీను అన్నారు. పట్టణ శివారులో ప్రమాదాలకు కారణమైన స్థలాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదకరమైన మూలమలుపును గుర్తించిన ఆయన వెంటనే జేసీబీ తెప్పించి రోడ్డుకు ప్రక్కన ఉన్న చెట్ల పొదలను తొలగింపచేసి రోడ్డుపై స్టాపర్స్‌ను ఏర్పాటు చేయించారు. అనంతరం మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సాయపల్లి శివారు ప్రాంతంలో ఇటీవల జరిగిన రెండు ప్రమాదాల్లో ఇద్దరు చనిపోయారన్నారు. ఎస్‌ఐ నీరేశ్, సిబ్బందితో కలిసి ఆ స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టవలసిన చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై సమీక్షించామని చెప్పారు. అతివేగం, మద్యం తాగి, అవగాహన రాహిత్యంతో వాహనాలు నడపడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. ప్రతి వాహనదారుడు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని సూచించారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని కోరారు.



బోనాలు సమర్పిస్తున్న మహిళలు

బోనం.. ఘనం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని పోచమ్మ, ముత్యాలమ్మ తల్లులకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి యేటాలాగే సోమవారం రోజున ప్రతీ కుటుంబం నుంచి రెండేసి బోనాలు.. శివసత్తుల పూనకాలు, బైండ్ల వారి ఆట పాటల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లారు. మహిళలు దేవతలకు ఒడిబియ్యం సమర్పించుకున్నారు. గ్రామం సుభిక్షంగా ఉండాలంటూ వేడుకున్నారు. అనంతరం సామూహిక వనభోజనం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు కాచం నవీన్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల పాండురంగం, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గంగిశెట్టి పాండురంగం, కార్యదర్శి రాజ్‌కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు కాపర్తి స్రవంతి, కార్యదర్శి స్వరూప, కోశాధికారి రమ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న గ్రామస్తులు

చిన్నశంకరంపేట(మెదక్): రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు మండలంలోని మడూర్ గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి రాజమల్లును సోమవారం గ్రామస్తులు సన్మానించారు. చేగుంట మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో రాజమల్లు ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు పంచాయతీ కార్యాలయం వద్ద అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు సత్కరించి, అవసరమైన నగదును అందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు భూపాల్, రమేశ్, బస్వరాజ్, వేణు, రమేశ్ పాల్గొన్నారు.

వర్షాల కోసం శివలింగానికి జలాభిషేకం



వెల్దుర్తి(తూప్రాన్): బండపై ఉంచిన పానకం సేవిస్తున్న భక్తులు



కౌల్వారం(నర్సాపూర్): శివలింగాన్ని జలంతో నింపిన భక్తులు

కౌల్వారం(నర్సాపూర్): మండలంలో పంటలను రక్షించుకునేందుకు రైతులు ప్రతీక్షణం వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. మరోవైపు చెరువుల్లో, కుంటల్లో నీరు లేక మూగజీవాలకు తాగునీరు అందని పరిస్థితులు కనిపిస్తున్నాయి. వరుణ దేవుడి కటాక్షం కోసం మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన ప్రజలు సోమవారం హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివలింగానికి జలాభిషేకం చేశారు. దేవాలయ ఆవరణలో సప్త భజన చేశారు.

భస్వాపూర్ మల్లన్నగుట్ట వద్ద..

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని భస్వాపూర్ మల్లన్నగుట్ట వద్ద పలు గ్రామాల ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి ఆలయం గర్భగుడిలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బండ(గుట్ట)పై పానకం ఉంచి భక్తిశ్రద్ధలతో సేవించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లేశం పాల్గొన్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న సాయన్న

హుస్నాబాద్‌రూరల్: మాదిగ ఉపకులాల ఐక్యతతోనే ఎస్సీ వర్గీకరణ అమలు సాధ్యమవుతుందని, కలిసికట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వర్గీకరణను అమలు చేయించాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లింగాల సాయన్న పిలుపునిచ్చారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన మాదిగ సన్నాహక సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 యేళ్ల పోరాట ఫలితంగానే సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. నియోజకవర్గ కేంద్రంలో వేయి డప్పులతో ర్యాలీ నిర్వహించి మాదిగల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో బత్తుల చంద్రమౌళి, బొజ్జ హరీశ్, ఎలగందుల లక్ష్మీనారాయణ, గడిపె కొమురయ్య, హరికిషన్, జి.రవీందర్, తొందూరి ఎల్లయ్య, కోతి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.